## క్లుప్తంగా

### ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



**తోటమూల(గంపలగూడెం):** మండలంలోని తోటమూల ముత్యాలమ్మ ఆలయంలో ఐదవ వార్షికోత్సవ వేడుకలును బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడూరు జీవన్ముక్తేశ్వరస్వామి ఆలయం ఆర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ అనంతరం పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అన్నదానంలో రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో ద్వాదశ ప్రదక్షిణలు



**ఊటుకూరు(గంపగూడెం):** ఊటుకూరు కోదండరామాలయంలో పదవ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. దేవతామూర్తులు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి మూలవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు జరిపారు. దేవతామూర్తుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

### శోభాయాత్ర కరపత్రాల పంపిణీ



**గంపలగూడెం:** హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను బుధవారం గంపలగూడెంలో పలు వీధుల్లో పంపిణీ చేశారు. ఆరోజు గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానం వరకు భక్తులు బైకులు, ఆటోలు, కార్లతో ప్రదర్శనగా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** తన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారన్న మనస్తాపంతో ఓ వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పూర్ణానందంపేటలో జరిగింది. బాధితుడి బంధువుల కథనం మేరకు.. పిన్నప్రోలు చెన్నారావు పూర్ణానందంపేటలో కుటుంబ సభ్యులతో కలసి నివసిస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉన్న అతని స్థలాన్ని చికెన్ సెంటర్ నిర్వహించుకునేందుకు ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. కొంతకాలం తరువాత అద్దెకు ఉంటున్న వ్యక్తి స్థానిక పెద్దల అండదండలతో ఆ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపిస్తూ చెన్నారావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో తనకు న్యాయం జరిగేలా లేదంటూ మనస్తాపంతో బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చెన్నారావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### వేధింపుల భర్తపై కేసు నమోదు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన పైడి ఝాన్సీ, అశోక్‌కుమార్ భార్యాభర్తలు. వారిది ప్రేమ వివాహం. అశోక్‌కుమార్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. రోజూ మద్యం తాగొచ్చి భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ వేధింపులను తాళలేని ఝాన్సీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



కృష్ణసుందర రావు (ఫైల్)

**జి.కొండూరు:** జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎ కృష్ణసుందరరావు(60) తన స్వగ్రామం కవులూరులో మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణసుందరరావు ఉపాధ్యాయుడిగానే కాకుండా యూటీఎఫ్ సంఘంలో రాష్ట్ర కార్యదర్శిగా ఉంటూ అనేక ఉద్యమాలలో కీలకపాత్ర పోషించారు. ఉపాధ్యాయుల సమస్యలపై మంగళవారం సాయంత్రం కూడా ఎన్టీఆర్ జిల్లా డీఈఓని కలిసిన యూటీఎఫ్ కమిటీలో ఆయన కూడా ఉన్నట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. కృష్ణసుందరరావు మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# సర్కారు బడులకు రక్షణ

**జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్**





నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్

**నూజివీడు:** జిల్లా పరిషత్ హైస్కూళ్ల పరిరక్షణకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో నియోజకవర్గంలోని హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్ నియామకానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మే ఒకటో తేదీ నుంచి వాచ్‌మెన్ బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంకా పలు హైస్కూళ్లలో నియామక ప్రక్రియ పూర్తికాలేదు. హైస్కూళ్లలో ఏళ్ల తరబడి వాచ్‌మెన్‌లు లేక గతంలో పలు హైస్కూళ్లలో కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. అంతేగాకుండా రాత్రివేళ హైస్కూళ్ల ఆవరణలు మందుబాబులకు, జూదరులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మద్యం మత్తులో తాగిన సీసాలను పగులగొట్టి అక్కడే పారవేయడం వంటివి సైతం చోటు చేసుకున్నాయి. సెలవు రోజుల్లో అయితే హైస్కూళ్లలో ఇష్టారాజ్యంగా ఆకతాయిలు వ్యవహరించేవారు. సంచార జాతుల వారు సైతం హైస్కూళ్లలో తిష్టవేసేవారు. వీటన్నింటిని పాఠశాలల్లో పనిచేసే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు.

**స్థానికులకే ప్రాధాన్యం**

హైస్కూళ్లకు నియమించే నైట్ వాచ్‌మెన్ నియామకంలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాచ్‌మెన్‌కు నెలకు రూ.6వేల గౌరవ వేతనం అందజేస్తారు. వాచ్‌మెన్ పోస్టుకు హైస్కూల్లో పనిచేసే ఆయా భర్త గానీ, వంటచేసే మహిళ భర్తకు గానీ తొలి ప్రాధాన్యం ఇచ్చారు. లేకుంటే 60 ఏళ్ల లోపు వయస్సున్న స్థానిక ఎక్స్ సర్వీసుమెన్ గానీ, పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గానీ నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ నిబంధనల నేపథ్యంలో హైస్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించే ప్రక్రియలో హైస్కూళ్ల హెచ్‌ఎంలు నిమగ్నమయ్యారు.

**హైస్కూళ్ల ఆస్తుల రక్షణ కోసమే**



జెడ్పీ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణ కోసమే నైట్ వాచ్‌మెన్‌లను ప్రభుత్వం నియమిస్తోంది. హైస్కూళ్లలో ఎన్నో విలువైన సామగ్రి ఉండటమే కాకుండా, ఆవరణల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలపాలను నిరోధించవచ్చు.

– సేవియా, డీవైఈఓ, నూజివీడు

# సచివాలయాల వ్యవస్థతో మెరుగైన సేవలు

**ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు**



పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

**చాట్రాయి:** గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందిస్తున్నామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని చనుబండ, చిన్నంపేట గ్రామాల్లో సుమారు రూ.1.10 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, పీఏసీఎస్ భవనాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలన్న ఆలోచనతో సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ వారి కుటుంబాలను ఆర్థికంగా నిలబెడుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ కో– ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ భూక్యా రాణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు విస్సంపల్లి జ్యోతి, పరసా ధనలక్ష్మీ, ఎంపీపీ లంకా నిర్మల, మండల ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, ఏపీసీఏస్ చైర్మన్లు మోరంపూడి నాగేశ్వరావు, పరసా చెన్నారావు, చెలికాని బాబ్జీ, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీఓ ఎస్ మురళీమోహనరావు పాల్గొన్నారు.

# ధ్యానంతో ఏకాగ్రత



తిరువూరు శాఖా గ్రంథాలయంలో శిక్షణ తరగతులు

**తిరువూరు:** విద్యార్థి దశలో ఏకాగ్రత సాధనకు క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని తిరువూరు శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో బుధవారం విద్యార్థులకు ధ్యానంలో మెలకువలు, ఆవశ్యకతను వివరించారు. తెల్లవారుజా మునే నిద్రలేచి పుస్తక పఠనం చేస్తే ఎల్లప్పుడూ గుర్తుంటుందని, మెదడు చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ధ్యానం చేయడంతో మానసిక అస్థిరతను అధిగమించి మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలుగుభాష విశిష్టతను తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు వివరించారు.

**నీతి కథల పఠనం**

**గంపలగూడెం:** మండలంలోని పెనుగొలనుశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో బుధవారం నీతి చంద్రిక కథలు చదివించారు. అనంతరం గ్రంథాలయ నిర్వహణాధికారి వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం, పరమపదసోపానం, హౌసీ ఆటల్లో 25 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు**

**మైలవరం:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయా లు అని పొందుగల ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు టి.ఓమ్ ప్రకాష్ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మూడో రోజు బుధవారం వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఓమ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థి చిరిగిన చొక్కా అయినా తొడుక్కుని ఒక మంచి పుస్తకం కొనుక్కోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సయ్యద్ అహ్మద్, సిబ్బంది రాజేంద్రప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

### చదవడం మాకిష్టంపై అవగాహన

**గానుగపాడు(తిరువూరురూరల్):** విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆంగ్లభాషలో నైపుణ్యం సాధించేందుకు కృషిచేయాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రాంప్రదీప్ సూచించారు. మండలంలోని గానుగపాడులో విద్యార్థులకు, తల్లిదండ్రులకు చదవడం మాకిష్టం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో వేసవిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఉదయ్

**తిరువూరు:** భారత కమ్యూనిస్టు పార్టీ తిరువూరు పట్టణ కార్యదర్శిగా మాలపాటి ఉదయ్ నియమితులయ్యారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్లో బుధవారం జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు ఉదయ్‌ను నియమించినట్లు తెలిపారు.

### ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

**మైలవరం:** విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్టుపై పట్టు సాధించాలని హైదరాబాద్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి ప్రొఫెసర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లెర్నర్ సెంట్రిక్ అప్రోచస్ అండ్ టీచింగ్ అడ్వాన్స్ ఇంగ్లిష్ ఒకాబ్యులరీ ఇన్ ద ఇండియన్ క్లాస్ రూమ్స్ అనే అంశంపై ఒక రోజు నేషనల్ వెబినార్ బుధవారం జరిగింది. తరగతుల్లో సింపుల్ ఇంగ్లిష్ పదాలు వాడటం వలన విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. క్లాస్ రూమ్‌లో ఇంగ్లిష్ పాఠాలు ఎలా బోధించాలి, ఎలాంటి పదాలు వాడితే లాంగ్వేజ్‌లో పట్టు సాధిస్తారు తదితర విషయాలు కూలంకషంగా చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెడ్ బి.సుభాషిణీ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జే రాముడు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి పాల్గొన్నారు.

# 13న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

**నూజివీడు:** ఉమ్మడి కృష్ణా జిల్లా యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికను ఈ నెల 13వ తేదీన విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీలో నిర్వహించనున్నట్లు కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ సుభాష్ చంద్రబోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి, 2007 తరువాత జన్మించిన వారు మాత్రమే ఈ ఎంపికలో పాల్గొనాలని, మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు నకలు, ఒరిజనల్, పదో తరగతి మార్కుల లిస్టు తీసుకుని రావాలని పేర్కొన్నారు. ప్రతి క్లబ్, అసోసియేషన్ పది మంది క్రీడాకారులు మాత్రమే ఎంపికకు అనుమతిస్తారని తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ఆరో యూత్ ఏపీ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు



స్టేడియంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాణా

**విజయవాడ స్పోర్ట్స్:** దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాణా బుధవారం పరిశీలించారు. ఈ యజ్ఞానికి వచ్చే భక్తులు, ప్రముఖులకు భద్రత, రక్షణ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని స్టేడియం పరిసరాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో సీపీ వెంటన డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీలు భాస్కరరావు, వెంకటనారాయణ, సీఐ గుణరాము ఉన్నారు.

### కారు బీభత్సం, ఇద్దరికి గాయాలు



కొండపల్లిలో రోడ్డుపై పల్టీకొట్టిన కారు

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి డీఏవీ పాఠశాల సమీపంలో 30వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇబ్రహీంపట్నం వైపు నుంచి మైలవరం వైపు వెళ్తున్న కారు ముందుగా రోడ్డు పక్కన ఇంటిముందు ఆపి ఉంచిన కారును ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా రో డ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న అప్పారావు అనే వృద్ధుడిని ఢీకొట్టింది. అ నంతరం అదుపుతప్పి రోడ్డుపై పల్టీ కొట్టింది. ఈ ఘనటలో అప్పారావుతో పా టు కారులో ఉన్న మరోవ్యక్తి గాయపడ్డారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

# రైతులకు అండగా సీఎం జగన్



అడవినెక్కలం పీఏసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, కేడీసీబీ చైర్మన్ నాగేశ్వరరావు

**ఆగిరిపల్లి:** రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని అడవినెక్కలంలో రూ.40.50 లక్షలతో నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే ప్రతాప్, కేడీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే నూజివీడుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తారని ఆయన చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. కేడీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి సహకార వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొక్కపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మొక్కపాటి కిరణ్, వేము రాజు, మొక్కపాటి వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ బూక్యా రాణి, ఎంపీపీ అనూష, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జీ మచ్చా హరిబాబు, ఆగిరిపల్లి కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మరియమ్మ పాల్గొన్నారు.

# 'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం



ఉపాధిహామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

**నూజివీడు:** కోట్లాది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నర్సింహా అన్నారు. మండలంలో పల్లెర్లమూడిలో బుధవారం ఉపాధి కూలీల పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటలా పనిని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఈ పథకాన్ని ఎత్తివేయడం కోసం బీజేపీ చేసిన అనేక కుట్రలలో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషకం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు చేస్తోందన్నారు. దళిత గిరిజనులను, మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చిందన్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి నిధులు పెంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కుటుంబానికి 200 పనిదినాలు, రూ.600 దినసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిలో యంత్రాలు, కాంట్రాక్టర్లను నిషేధించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి లక్ష్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు

# దిశయాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి



దిశయాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ ఆర్ అంకబాబు

**నూజివీడు:** మహిళలు, యువతులు దిశయాప్‌ను తమ స్మార్ట్ ఫోన్‌లలో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని, దిశయాప్ ఫోన్‌లో ఉంటే పోలీసులు మీ వెంటే ఉన్నారనే భరోసా కలుగుతుందని నూజివీడు రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు అన్నారు. మండలంలోని గ్రామాల్లో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో దిశయాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని బుధవారం ముమ్మరంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని గొల్లపల్లిలో రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని యాప్ గురించి అవగాహన కల్పించారు. దిశయాప్‌లో ఉన్న ఎస్ఓఎస్‌ను ప్రెస్ చేసిన వెంటనే సమాచారం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తుందన్నారు. వెను వెంటనే సంబంధిత ఏరియా పోలీసు అధికారులకు సమాచారాన్ని తెలియజేసి సంఘటన స్థలంలోకి 10 నిమిషాల్లో పోలీసులు చేరుకుంటారన్నారు. ఆపదలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటల అభివృద్ధి



వరాహ పుష్కరిణి పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్

**ఆగిరిపల్లి:** ఐదు ఎకరాల లోపు నీటి కుంటలను ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. స్థానిక పురాతన శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చెందిన శోభనాపురం రోడ్డులో గల వరాహ పుష్కరిణి అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా బుధవారం అసిస్టెంట్ కలెక్టర్, డ్వామా పీడీ ఎ.రాముతో కలిసి వరాహ పుష్కరిణి పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని ఆదేశాల మేరకు ఐదు ఎకరాలు లోపు ఉన్న నీటి కుంటలను ఎంపిక చేసుకుని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 75 నీటి కుంటలను అభివృద్ధి చేస్తుండగా ఆలయాల తరపున ఆగిరిపల్లి శోభనాచలస్వామి ఆలయానికి చెందిన పుష్కరిణి ఎంపిక చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలతో ఉపాధి హామీ పథకం ద్వారా పుష్కరిణిలో మట్టిని పూడిక తీయాలన్నారు. ఎవరైనా రైతులు ముందుకు వస్తే వారి పొలాల్లోకి తరలించాలని సూచించారు. ఈ పూడిక ప్రక్రియ మొత్తం ఉపాధి కూలీల ద్వారానే జరగాలన్నారు. ఎంపీడీఓ కె.వాణి, ఆగిరిపల్లి-2 ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపీనాథ్, ఏపీఓ మీనాక్షి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సచివాలయ కన్వీనర్ల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు అన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం, జీవనశైలిపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో భాగంగా అడవులను తగలబెట్ట రాదన్నారు. భవిష్యత్ తరాలకు నీటిని పొదుపు చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం నివారించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.

### నేడు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**జి.కొండూరు:** జి.కొండూరులో పేదలకు పక్కా గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో గురువారం ఉదయం 8గంటలకు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీఓ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలని కోరారు.